క్లుప్తంగా

విద్యా సామగ్రి అందజేత


సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

పుల్లంపేట : పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభా హైస్కూల్‌లో మంగళవారం 1996–97 10వ తరగతి విద్యార్థులు తాము చదివిన పాఠశాల కోసం కృతజ్ఞతాభావంతో గ్రీన్ బోర్డులు, పబ్లిక్ అడ్రెసింగ్ స్పీకర్లు, విద్యార్థులకు జామెట్రి బాక్సులు, వాటర్ క్యాన్లు అందజేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా బెడ్ ఏర్పాటు


క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన యోగా బెడ్

రాజంపేట టౌన్ : ప్రజా సౌకర్యార్థం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో రూ.50 వేల వ్యయంతో యోగా బెడ్‌ను ఏర్పాటు చేసినట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ 302 డిస్ట్రిక్ట్ మాజీ కౌన్సిలర్ కొండూరు శరత్‌కుమార్‌రాజు మంగళవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. రాజంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ యోగా బెడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో అనేక మంది వాకింగ్ కోసం వస్తున్నారని, వాకింగ్‌కు వచ్చే వారంతా యోగా చేసుకునేందుకు వసతి లేక ఇబ్బందులు పడుతుండటంతో వాకర్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగాతో అనేక దీర్ఘకాలిక వ్యాధులు దూరం కాగలవని తెలిపారు.

నేడు చేనేత సమస్యల పరిష్కార వేదిక

సిద్దవటం : సిద్దవటం, అట్లూరు మండలాల పరిధిలో ఉన్న చేనేత కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఉదయం 9.30 గంటలకు మాధవరం – 1 గ్రామ శివారులోని శ్రీ కనకదుర్గా కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపీడీఓ మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో ఉన్న చేనేత కార్మికులు, చేనేత సహకార సంఘాల ప్రెసిడెంట్లు, మాస్టర్ వీవర్స్, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వలంటీర్లు, మండల స్థాయి అధికారులతో చేనేత కార్మిక సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నారన్నారు.

రాజంపేట డీటీగా లవన్‌కుమార్ బాధ్యతలు

రాజంపేట రూరల్ : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పి.లవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీగా విధులు నిర్వర్తించిన ఏ.శ్రీకాంత్‌రెడ్డి బదిలీపై వీరపనాయునిపల్లికి బదిలీ అయ్యారు. నందలూరు ఆర్‌ఐగా పని చేస్తున్న వీరాంజనేయులు ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. పెనగలూరులో డీటీగా పనిచేస్తున్న ఎం.సుజాత బదీలిపై వచ్చి ఇక్కడ ఎన్నికల డీటీగా బాధ్యతలు స్వీకరించారు. టి.సుండుపల్లెలో ఆర్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఫణికృష్ణ ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. కాగా రాజంపేట మండలంలో 31 మంది వీఆర్‌ఓలు విధులు నిర్వర్తించాల్సి ఉండగా 24 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఊటుకూరు, పోలి, ఆకేపాడు, మిట్టమీదపల్లి, ఆర్‌ఎస్‌రోడ్‌-1లలో వీఆర్‌ఓ పోస్టులు లేక ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా మందపల్లి వీఆర్‌ఓ విధులకు దూరంగా ఉండగా, ఎంజీపురం వీఆర్‌ఓ సస్పెన్షన్‌లో ఉన్నారు.

చీటింగ్ కేసు నమోదు

పెద్దమండ్యం : వాట్సాప్ ద్వారా ఫోన్ చేసి రూ. 80 వేలు కాజేసిన గుర్తుతెలియని వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయుడు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం గ్రామం కుంటలకాడపల్లెకు చెందిన ఎం. వెంకటాచలపతి నెట్ సెంటర్, మొబైల్ బ్యాంకింగ్ నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి తాను ఎస్‌ఐని అని చెప్పి వాట్సాప్ ద్వారా ఫోన్ చేసి రూ. 80 వేలు వేయాలని చెప్పాడు. నగదు స్టేషన్ దగ్గరకు వచ్చి తీసుకుపోవాలని తెలిపాడు. దీంతో ఫోన్‌పే ద్వారా రూ. 80 వేలు వేసిన వెంకటాచలపతి నగదు కోసం పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లాడు. అయితే అక్కడికి వెళ్లి ఫోన్ చేయగా ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించాడు. ఈ మేరకు తాను మోసపోయిన వైనంపై ఎస్‌ఐకి వివరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

రామసముద్రం : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం చెంబకూరు బస్టాండ్ ఆవరణంలో సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రజల సంక్షేమమే జగనన్న సంకల్పం


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : ప్రజల సంక్షేమమే జగనన్న సంకల్పమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 28, 29 వార్డులలో ఆయన గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. భట్టువీధి, షుక్రిమియావీధి, రంగీన్ షావలి, చౌషన్‌దర్గా వీధులు, నాదానవీధి, న్యూసీమ హోటల్‌వీధి, ట్రంకురోడ్డు, మేదర వీధులలో ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. బస్టాండు సర్కిల్‌లోని వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి శ్రీకాంత్‌రెడ్డి నివాళులర్పించారు.

భట్టువీధి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

భట్టువీధి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారిస్తామని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గతంలో సరైన ప్రణాళిక లేకుండా ఇళ్ళ నిర్మాణాలు చేపట్టడంతో వీధులలో ఆటోలు సైతం వెళ్లలేని పరిస్థితులకు పరిష్కార మార్గం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇళ్ళ పైనున్న విద్యుత్‌లైన్‌లను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. డ్రైనేజీలు, పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులందరికి నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో పక్కాగృహాలను మంజూరు చేయిస్తామన్నారు.

డైట్ ఎదురు సందులో ఉన్న దర్బార్‌వలీ తన కుమార్తె ఇంటర్ చదువుతోందని, పుస్తకాలివ్వాలని ఎమ్మెల్యేను కోరగా, పుస్తకాలు అందిస్తానని ఆయన హామీనిచ్చారు. జగనన్న చేదోడు కింద తనకు అందిన ఆర్థికసహాయంతో టైలరింగ్ వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్నట్లు భట్టువీధికి చెందిన ఇక్బాల్‌బాషా ఎమ్మెల్యే ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ట్రంకు రోడ్డు, మేదర వీధులలో ప్రజలు, చిరు వ్యాపారులు, దుకాణాదారులతో మమేకం అయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్లు మెహజబీన్, సాదక్‌అలీ, అల్తాఫ్, కొలిమి చాన్‌బాషా, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, కో–ఆప్షన్ సభ్యుడు అయ్యవారురెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు హబీబుల్లా ఖాన్, బేపారి మహమ్మద్‌ఖాన్, జానం రవీంద్ర, బుజ్జిబాబు, విజయభాస్కర్, హజరత్ ఖాదర్‌వలీ, ఆనంద్‌రెడ్డి, రియాజుర్ రహిమాన్, జాఫర్ అలీఖాన్, సున్నా ఇర్షాద్, మూసా, ఫజుల్‌రహిమాన్, షిరిడీసాయి కళాశాల మనోజ్‌రెడ్డి, కొత్తపల్లె ఇంతియాజ్, నాదర్ బేగ్, జావీద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి గ్రామాల్లో..

ఈనెల 22 నుండి 26వ తేదీ వరకు రాయచోటి రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం పెమ్మాడపల్లె, 23వతేదీ దిగువ అబ్బవరం, 24, 25తేదీలలో శిబ్యాల గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులంతా హాజరుకావాలన్నారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం


సంక్షేమాన్ని తెలుపుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీలోని రాచపల్లి, అరుంధతివాడలలో ఆర్‌వి.రమణ ఆధ్వర్యంలో గడపగడపకు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. కొరముట్ల రాకతో గ్రామ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఏ గడపకు వెళ్ళినా ఆయనను ఆప్యాయంగా ఆహ్వానం పలికారు. తమ కష్ట, సుఖాలు అడిగి తెలుసుకుని ప్రభుత్వం తరఫున మరింతగా అండగా నిలుస్తాం అని భరోసా ఇవ్వడం చాలా గొప్పవిషయం అని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తాము ఇంత వరకు ఏ ప్రభుత్వంలో కూడా చూడని గొప్ప పరిపాలను చూస్తున్నామని వారు ఆనందం తెలిపారు. గ్రామంలో తిరుగుతూ ప్రతి గడపకు ప్రతి కుటుంబానికి నవరత్న పథకాలు వివరిస్తూ లబ్ధి పొందని వారికి ఎందుకు రాలేదో వివరిస్తూ, అక్కడే అధికారుల సమక్షంలో పరిష్కారం చూపుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందిన లబ్ధి వివరాలతో కూడిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసిన కరపత్రాలను అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా మీకు అందరికీ తోడు నీడగా నిలుస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీరంతా బాసటగా నిలచి మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను చేయాలని కోరారు. స్థానిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని సుమారు రూ.1200 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణాలు, బీటీరోడ్లు, మంచినీటి సమస్యల పరిష్కారం, విద్యుత్ సమస్యలు వంటివి పరిష్కారం చేసి అభివృద్ధ/ పనులు చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం అని ప్రజలు తెలుపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జెట్పీటీసీ రత్నమ్మ, ఓజీ.శ్రీనివాసులరెడ్డి, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, రవిచంద్రారెడ్డి, నిమ్మకాయల మొహన్‌రెడ్డి, ఓబులరెడ్డి, శివారెడ్డి, జనార్దన్‌రాజు, బండారు మల్లి, పలిగల రాజ, మణి, రమణారెడ్డి, సిద్దయ్య, రాజేంద్ర, వైఎస్ కరీముల్లా, ఆజాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు

నందలూరు(రాజంపేట) : నందలూరుకు సెకండ్ ఎంఈఓగా అనంతకృష్ణ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. చిట్వేలి మండల అనంతరాజుపల్లెలో ప్రధానోపాధాయడిగా పనిచేస్తూ పదోన్నతిపై సెకండ్ ఎంఈఓగా వచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓను స్థానిక నాగిరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్ లో ఇన్‌చార్జి ఎంఈఓ గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ యూనియన్ నాయకులు అల్లం అశోక్‌కుమార్, రమేష్‌బాబు, అలీఖాన్, మోహనరాజు, లీలాకృష్ణ, హరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు ఎంఈఓగా సుబ్బరాయుడు

పెనగలూరు : మండల విద్యాశాఖ అధికారిగా సుబ్బరాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈఓగా పనిచేస్తున్న జయవేలు తిరుపతి రూరల్‌కు బదిలీ అయ్యారు. సుబ్బరాయుడు గతంలో నల్లపరెడ్డిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించారు. సుబ్బరాయుడు ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

సిద్దవటం : ఎంఈఓ– 2గా మంగళవారం ఆవుల అరుణ బాధ్యతలు చేపట్టారు. ఈమె నందలూరు మండలంలోని నల్లతిమ్మాయపల్లెలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిరహిస్తూ పదోన్నతిపై ఎంఈఓగా సిద్దవటానికి వచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అలాగే విధి నిర్వహణలో ఉపాధ్యాయులు సమయం పాటించాలని ఎంఈఓ సూచించారు.

వీరబల్లె ఎంఈఓ – 2గా కంచమి కృష్ణయ్య

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల ఎంఈఓ–2గా కంచమి కృష్ణయ్య నియమితులయ్యారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ పదోన్నతిపై వీరబల్లె మండల విద్యాశాఖాధికారి – 2గా వచ్చినట్లు తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడే విధంగా తాను కృషి చేస్తానన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ 302 డిస్ట్రిక్ట్ మాజీ రీజనల్ కౌన్సిలర్ కొండూరు శరత్‌కుమార్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె జబ్బులకు సంబంధించి నారాయణాద్రి హాస్పిటల్ వైద్య బృందం, కంటి చూపునకు సంబంధించి తిరుపతికి చెందిన వాసన్ ఐకేర్ హాస్పిటల్ వైద్యులు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా రోగులకు ఈసీజీ, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలు గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షను చేయించుకోవాలని కోరారు.

26 నుంచి కుష్టు వ్యాధి సర్వే

నందలూరు(రాజంపేట) : ఈనెల 26 నుంచి మూడు వారాలపాటు జరిగే కుష్టు వ్యాధిగ్రస్తులు సర్వే విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు పీహెచ్‌సీ సభా భవనంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, వలంటీర్లతో సర్వే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి అనేది అంటు వ్యాధి కాదన్నారు. అది ఒక దీర్ఘకాలిక వ్యాధి అన్నారు. సర్వేలో ముందుగా గుర్తించి, చికిత్స అందిస్తామన్నారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నారాయణ, సూపర్‌వైజరు హిమశంకరి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లకు కొత్త ఫోన్ నెంబర్లు

సంబేపల్లె : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు కొత్త ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంటాయని విద్యుత్ ఏఈ రాజేశ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబేపల్లె సబ్‌స్టేషన్‌కు 8712625871, దేవపట్ల 8712652873, దుద్యాల 8712625872, శెట్టిపల్లె 8712625870 ల నెంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు.

యునానీ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయండి


వినతిపత్రాన్ని అందజేస్తున్న ముస్లిం మైనార్టీలు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ప్రభుత్వ యునానీ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని రాయచోటి ప్రాంత ముస్లిం మైనార్టీలు ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌లను కోరారు. అన్నమయ్య జిల్లాకు చెందిన పలువురు ముస్లిం మైనార్టీ పెద్దలు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డితో కలిసి కలెక్టర్ గిరీషా పీఎస్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర విభజన సమయంలో యునానీ వైద్యశాల ఏర్పాటుకు అనుమతి ఉందని, కావున అన్నమయ్య జిల్లా కేంద్రంలో యునాని వైద్యశాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, కళాశాల ఏర్పాటుకు అవసరమైన పది ఎకరాలు భూమిని కేటాయించేలా చూడాలని వినతిపత్రంలో కోరారు. స్థానికుల విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కళాశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు.

కుష్టువ్యాధిపై సర్వేను విజయవంతం చేయండి

రాయచోటి అర్బన్ : కుష్టువ్యాధి గుర్తింపు కోసం నిర్వహించే ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని యండపల్లె పీహెచ్‌సీలో మంగళవారం ఆయన డాక్టర్ శారద ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి కేసుల గుర్తింపు కోసం జూన్ 26 నుంచి జూలై 16 వరకు ఇంటింటి సర్వేను చేపడుతున్నామన్నారు. ఇప్పటి వరకు యండపల్లె పీహెచ్‌సీ పరిధిలో ఒక లెప్రసీ కేసు కూడా నమోదు కాలేదన్నారు. వైద్యసిబ్బంది ఇంటింటి సర్వేలో ప్రతిఒక్కరిని పరీక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక స్థితిగతులను మార్చుకోండి


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం నిరంజన్

లక్కిరెడ్డిపల్లి : మహిళా సంఘాల ద్వారా ఆర్థిక స్థితిగతులను మార్చుకోవచ్చని ఏపీఎం నిరంజన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండల సమైక్య సంఘాలకు విజన్ బిల్డింగ్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకోవడానికి సమైక్య సంఘాలు ఎంతో దోహదపడతాయన్నారు. సమైక్య సంఘాలు ద్వారా బ్యాంకు రుణాలు తీసుకొని సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు. ఐదు సంవత్సరాలలోపు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. సంఘంలో చేరిన ఒక్కొక్క సభ్యురాలు రూ. 30 వేలు నుంచి రూ. 5 లక్షలు వరకు బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల సమైక్య సభ్యురాలు మల్లమ్మ, సీసీలు రెడ్డిబాబు, సుబ్బరాయుడు, రాజన్న, చంద్రమోహన్, బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి


మాట్లాడుతున్న ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కాలేజ్ ఇంటర్ విద్యార్థులకు సైబర్ క్రైమ్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణతో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రహదారి భద్రతా నియమాలు, హెల్మెట్ వాడకుండా బైక్ నడపడం నేరమన్నారు. మత్తు పదార్థాలకు, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. ఈవ్ టీచింగ్, ర్యాగింగ్‌కు పాల్పడకూడదన్నారు. బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోమటి రెడ్డి శివశంకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, అధ్యాపకులు శ్రీకళ, నాగయ్య, సుజాత, నిత్య పూజయ్య, సుధాకర్, విజయ్ కుమార్, విజయ, మురళీ నాయక్, శ్రీనివాసులు, సుధీర్ కుమార్, పీడీ సోమశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో రాష్ట్రపతి పుట్టినరోజు వేడుకలు


రాష్ట్రపతి పుట్టినరోజు వేడుకులను నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : నందలూరు దుర్గాపురం ఎస్టీకాలనీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను పార్లమెంటు బీజేపీ కన్వీనరు సాయిలోకేష్ కట్ చేసి, ఎస్టీలకు తినిపించారు. అనంతరం ఎస్టీ వృద్ధ మహిళలను ఘనంగా సన్మానించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్, బీజేపీ సీనియర్ నాయకులు పోతురాజు మస్తానయ్య, ముంగి సుబ్బరాయుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌రాజు, నాయకులు విఠలాచార్య, కోడూరి ఆదినారాయణ, ప్రతాప్‌రెడ్డి అబ్బిగారి గోపాల్, ఎస్టీలు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

- రైతులకు ఆర్బీకే సిబ్బంది అందుబాటులో ఉండాలి
- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్


పరీక్షల నిమిత్తం మట్టి సేకరిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

రామాపురం : ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనాలను రైతులు పంట పొలాల్లో సాగు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిట్లూరు రైతు భరోసా కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలను వేసే దగ్గర నుంచి పంట పూర్తి వరకు పంటపై సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. విత్తనశుద్ధి గురించి కంచ పంట, ఎర్రపంటల ప్రాముఖ్యత గురించి వివరించారు. చీడ, పీడ నివారణల గురించి తెలియజేశారు. ప్రతి రైతు విధిగా మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతు భరోసా సిబ్బంది మట్టి నమూనాలను సేకరిస్తారని రైతులకు వివరించారు. సమావేశంలో లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాపు పూర్తయ్యాక చెట్లకు విశ్రాంతినివ్వండి


మామిడి రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యాన అధికారిణి నాగమణి

రాయచోటి టౌన్ : మామిడి కాపు పూర్తిగా తీసుకొన్న తరువాత చెట్లకు కనీసం 15–20 రోజులపాటు విశ్రాంతి ఇవ్వాలని మామిడి రైతులకు రాయచోటి ఉద్యానశాఖ అధికారిణి నాగమణి సూచించారు. మంగళవారం మామడి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చే క్రమంలో రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె, గొర్లమొదివీడు, మాధవరం గ్రామాలలోని మామిడి రైతులకు మామిడి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ మామిడి పంట పూర్తిగా చేతికి అందిన తరువాత మామిడి చెట్లకు కనీసం 15–20 రోజులు విశ్రాంతి కల్పించి తరువాత వాటికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. సస్యరక్షణలో భాగంగా చెట్టుకు నేరుగా సూర్యరశ్మి చెట్టు మొదలుపై పడేవిధంగా తూర్పు, పడమర వైపున ఉన్న కొమ్మలను కత్తిరించాలని చెప్పారు. అలాగే ఎండిన కొమ్మలు, ఎండిన పూత కాండలను తొలిగించాలని చెప్పారు. ఇలా కత్తిరించిన తరువాత కొమ్మలు, చెట్టు కొమ్మలు తడిచే విధంగా కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే తొలకరి వానలు కురవగానే వాలుకు అడ్డంగా దుక్కులు దున్నాలని తద్వారా వర్షపునీరు పూర్తిగా భూమిలోకి ఇంకుతుందని చెప్పారు. అలాగే మామడి తోటలలో సస్యరక్షణ చర్యలు చేపడుతూ ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది కవిత, కిరణ్‌కుమార్ రాజు, ప్రసన్న, నిరంజన్, రైతులు పాల్గొన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి


అవగాహన కల్పిస్తున్న డీఏహెచ్‌ఓ డాక్టర్ గుణశేఖర్

రాజంపేట రూరల్ : పాడి రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ డీఏహెచ్‌ఓ డాక్టర్ గుణశేఖర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నారపురెడ్డి గ్రామంలో మంగళవారం పాడి రైతులకు 'వైఎస్సార్ పశుబీమా పథకం'పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గుణశేఖర్ రైతులకు పశుబీమాపై అవగాహన కల్పించారు. బీమా పథకంలో చేరిన పాడి రైతు 20శాతం వాటా చెల్లిస్తే మిగిలిన 80శాతంలో కేంద్ర ప్రభుత్వం 40శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం చెల్లిస్తాయని తెలియజేశారు. ఆపదలలో పాడిరైతు నష్టపోకుండా ఈ బీమా లబ్ధి చేకూర్చుతుందని తెలియజేశారు. అవగాహన కార్యక్రమంలో రాజంపేట ఉపసంచాలకులు డాక్టర్ కె. ప్రతాప్, అత్తిరాల పశువైద్యాధికారి కె.భాగ్యవతి, జీవీఓ ఎం.వరదయ్య, పాడి రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీకి సన్మానం


ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ మేడా తదితరులు

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ సెక్రటరీ, ఇన్‌చార్జి ఈఓఆర్డీగా పనిచేసి, బదిలీ అయిన సందర్భంగా ప్రసాద్‌ను మంగళవారం పౌరసన్మానం చేశారు. సర్పంచ్ జంబు సూర్యనారాయణ నేతృత్వంలో నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రసాద్ విధులను బాధ్యతయుతంగా నిర్వర్తించేవారన్నారు. ఎంతటి సమస్యను సులువుగా పరిష్కరించి, ప్రజలకు మెరుగైన సేవలందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ అమీర్, సెక్రటరీ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నడిమీధి సుధాకర్, గీతాల నరసింహారెడ్డి, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, గుణయాదవ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీఐ విశ్వనాథరెడ్డికి అభినందన సభ


సీఐ దంపతులను సన్మానిస్తున్న డీఎస్పీ చైతన్య, పోలీసు సిబ్బంది

రైల్వేకోడూరు : బదిలీపై వెళ్తున్న రైల్వేకోడూరు సీఐ విశ్వనాథరెడ్డికు అభినందన సభను ఏర్పాటు చేశారు. మంగళవారం రాజ్ కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డీఎస్పీ చైతన్య హాజరయ్యాడు. సీఐ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సీఐ విశ్వనాథరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య, ఎస్‌ఐలు మోహన్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్లు, హేమాద్రి, సుభాష్, వెంకటేశ్వర్లులు, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్‌లు సాయికిషోర్‌రెడ్డి, మందల నాగేంద్ర, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, సీహెచ్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపండి


కొత్త మెనూను ప్రదర్శిస్తున్న అధికారులు

చిట్వేలి : జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జాకీర్ హుస్సేన్ మంగళవారం సాయంత్రం స్థానిక కేంద్రీకృత బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు మెనూ చార్జీలను పెంచిందని తెలిపారు. గతంలో ఇస్తున్న మెనూ చార్జీలను అదనంగా రూ. 150లు పెంచి మొత్తం రూ. 1400లు చేసిందన్నారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూను మంగళవారం నుంచి ఆవిష్కరిస్తున్నట్లు సంక్షేమాధికారి జాకీర్ హుస్సేన్ తెలియజేశారు.

మెనూను విధిగా అమలు చేయాలి

రాజంపేట టౌన్ : హాస్టల్ విద్యార్థులకు మరింత మెరుగైన పౌష్టిక ఆహారం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొత్త మెనును వసతిగృహ అధికారులంతా విధిగా అమలు చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారత అధికారి (డీఎస్‌డబ్ల్యూఅండ్‌ఈఓ) ఎస్.జాకీర్ హుస్సేన్ తెలిపారు. స్థానిక ఎస్సీ–2 బాలుర హాస్టల్‌లో మంగళవారం ఆయన వసతిగృహ అధికారులతో కలిసి నూతన మెను ఛార్ట్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రతి హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించే బాధ్యత వసతి గృహ అధికారులపై కూడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ ప్రేమ్‌సాగర్, ఎస్.రామాంజులు, రాజశేఖర్‌రాజు, నరసింహరాజు, హరిప్రసాద్, రాణి తదితరులు పాల్గొన్నారు.